06-03-2025
గురువారం
మల్కాజిగిరి
jayabherinews
JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 166 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
జయభేరి



# ఏపీకి మళ్లీ మోడీ

**జయభేరి, విజయవాడ, మార్చి 5:**

ఏపీ విషయంలో ఉదారంగా వ్యవహరిస్తున్నారు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ. మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీకి ప్రత్యేక నిధులు, ప్రాజెక్టులు మంజూరు చేస్తున్నారు. గతంలో విశాఖకు వచ్చి లక్షల కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. విశాఖపట్నం రైల్వే జోన్ కు శంకుస్థాపన చేశారు. అయితే ప్రధాని మరోసారి ఏపీకి వస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందింది. ఈనెల రెండో వారంలో ప్రధాని మోదీ ఏపీకి రానున్నట్లు తెలుస్తోంది. జనవరిలో విశాఖలో ప్రధాని మోదీ పర్యటించారు. రెండు నెలల తిరగకముందే.. మరోసారి ఏపీకి ప్రధాని వస్తుండడం ప్రాధాన్యత సంతరించుకుంది.కృష్ణా జిల్లా నాగాయలంక మండలం గొల్లలమోదలో నిర్మించ తలపెట్టిన రక్షణ శాఖకు చెందిన క్షిపణి పరీక్ష కేంద్రానికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు. రక్షణ శాఖలో కీలకమైన క్షిపణి వ్యవస్థకు మోడీ సర్కార్ అత్యంత ప్రాధాన్యమిస్తూ వస్తోంది. ఈ క్రమంలో గత టిడిపి హయాంలోనే నాగాయలంకలోని గుల్లలమోదను ఎంపిక చేశారు. సమీపంలోనే తీరం ఉండడం.. భూమ్యాకర్షణ శక్తి కూడా ఎక్కువగా ఉన్న నేపథ్యంలో దీనిని ఎంపిక

...మిగతాది 2 లో



# వచ్చే నెల నుంచి అమలు

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన

**జయభేరి, న్యూ డిల్లీ మార్చి 5 :**

సుంకాల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. ఇప్పటికే కెనడా, మెక్సికో దిగుమతులపై 25 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. పెంచిన సుంకాలు మార్చి 4 (అమెరికా కాలమానం ప్రకారం) నుంచి అమల్లోకి వచ్చాయి. ఇక భారత్ పై విధించిన ప్రతీకార సుంకాలు వచ్చే నెల నుంచి అమలు కానున్నాయి.భారత్, చైనా సహా పలు దేశాలపై ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార సుంకాలు అమలు చేయనున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్

...మిగతాది 2 లో

# రంగనాయక సాగర్ ప్రాజెక్టును సందర్శించిన హరీష్ రావు



**జయభేరి, సిద్దిపేట:**

సిద్దిపేట నియోజకవర్గం చిన్నకోడూరు మండలం చంద్లపూర్లోని రంగనాయక సాగర్ ప్రాజెక్టును మాజి మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ రంగనాయక సాగర్లోకి కాలేశ్వరం పంప్ హౌసుల ద్వారా నీటిని విడుదల చేసినందుకు ఉత్తమ్ కుమార్ రెడ్డి ధన్యవాదాలు. సిద్దిపేట నియోజకవర్గంలో 50 వేల ఎకరాల్లో పంట సాగు అవుతుంది. పంట చేతికొచ్చే సమయానికి నీళ్లు లేకపోతే రైతులు ఇబ్బంది పడతారని విజ్ఞప్తి చేయగా, అనంతసాగర్ నుండి 1 టిఎంసి నీళ్లను రంగనాయక సాగర్కు పంపినందుకు ఉత్తమ్ కుమార్ రెడ్డి ధన్యవాదాలు. నా కోరిక మేరకు ఒక్క టిఎంసి నీటిని ఉత్తమ్ కుమార్ రెడ్డి విడుదల చేశారు. గత ప్రభుత్వం చేసిన మంచి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం తుడిచిపెట్టాలని చూస్తుంది.. ప్రజలకు నష్టం చేయకూడదు. ఎస్సారెస్పీ స్టేజ్ 2లో తుంగతుర్తి, కోదాడ, సూర్యాపేట, భూపాలపల్లి ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయి. ఎస్సారెస్పీ నీరు తగ్గినప్పటికీ, కాలేశ్వరం ద్వారా రెండు పంటలకు సాగునీరు విడుదల చేశాం. కాలేశ్వరంలో 15 రిజర్వాయర్లు బాగున్నాయి, 23 కిలోమీటర్ల టన్నెల్లు బాగున్నాయి, 19 సబ్ స్టేషన్లు బాగున్నాయి, 21 హౌసులు బాగున్నాయి, ప్రెజర్ మైన్లు బాగున్నాయి. మేడిగడ్డలో ఏడు బ్లాకులు ఉంటే, అందులో ఒక్క బ్లాక్లో ఒక్క పిల్లర్ మాత్రమే కుంగిపోయింది. కానీ గోరంతను కొండంత చేసి టిఆర్ఎస్పై బురదజల్లే


...మిగతాది 2 లో

# ఆమె చెప్పిందే రూల్



**జయభేరి, హైదరాబాద్, మార్చి 5:**

తెలంగాణ ఏఐసీసీ ఇంఛార్జ్ గా మీనాక్షి నటరాజన్ ఇటీవల బాధ్యతలు తీసుకున్న విషయం తెలిసిందే. గాంధీభవన్ లో అనుబంధ సంఘాల ఛైర్మన్లు, అధ్యక్షులతో ఇవాళ ఆమె భేటీ అయ్యారు. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ భేటీ జరిగింది. భేటీలో రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులు, ముఖ్యమైన అంశాల గురించి మీనాక్షి నటరాజన్ పార్టీ నేతలతో చర్చించారు .ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నేతలు తమ పనితీరు నివేదకలను ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ కి సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పార్టీ నేతలకు మీనాక్షి నటరాజన్ దిశా నిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ఎలాంటి నివేదికలు ఇవ్వకపోయినా ఎవరి పనితీరు ఏంటి అని..? తనకు తెలుసునని చెప్పారు. పని చేస్తుంది ఎవరు..? యాక్టింగ్ చేస్తుంది ఎవరు..? అనేది కూడా తనకు తెలుసని అన్నారు. కీలక నేతలు పార్టీ కోసం సమయం ఇవ్వాలని మీనాక్షి నటరాజన్ ఆదేశాలు జారీ చేశారు.పార్టీలో ఏం నడుస్తున్నా.. అంతర్గత విషయాలు బయట చర్చ చేయొద్దని హెచ్చరించారు. పార్టీ అంతర్గత సమాచారం బయటకు తెలిపిన వారిపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఒకవేళ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తన పనితీరు నచ్చకపోయినా... రాహుల్ గాంధీకి లేదా సోనియా గాంధీకి ఫిర్యాదు చేయొచ్చని చెప్పుకొచ్చారు. కానీ బయట మాత్రం పార్టీ అంతర్గత విషయాలు మాట్లొడద్దని తెలంగాణ ఏఐసీసీ చీఫ్ మీనాక్షి నటరాజన్ పార్టీ నేతలను హెచ్చరించారు.




# ఎకరం 50 కోట్లు

## అమ్మకానికి 500 ఎకరాలు

**జయభేరి, హైదరాబాద్, మార్చి 5:**


తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. హైదరాబాద్ గచ్చిబౌలిలో 400 ఎకరాల సర్కార్ భూమిని వేలం వేయాలని భావిస్తోంది. శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలి గ్రామం పరిధిలో ఈ భూమి ఉండగా.. టీజీఐఐసీకి ద్వారా విక్రయించేందుకు ప్రయత్నిస్తుంది. సంక్షేమ పథకాల అమలు, ఇతర ఇవసరాల కోసం డబ్బు సమీకరణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అంతర్జాతీయ స్థాయి లేఔట్‌ను అభివృద్ధి చేసి.. వేలం ద్వారా భూములను విక్రయింంచేందుకు కన్సల్టెంట్ నియామకానికి టెండర్లు పిలిచింది. ఈ నెల 15 వరకు బిడ్ల దాఖలుకు గడువిచ్చారు.డిసెంబర్ 2023లో కాంగ్రెస్ అధికారంలోకి రాగా.. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే మొదటి భూ వేలం ఇదే కానుంది. ఈ వేలం ద్వారా ప్రభుత్వం రూ. 20,000 కోట్లకు పైగా సేకరించాలని భావిస్తోంది. కంచ గచ్చిబౌలి గ్రామంలోని సర్వే నంబర్ 25(P) వద్ద ఉన్న 400 ఎకరాల స్థలంలో 'మాస్టర్ ప్లాన్ లేఅవుట్'ను అభివృద్ధి చేయాలని TGIIC యోచిస్తోంది. ఈ భూమిని

...మిగతాది 2 లో

# అప్పు చేసి చిప్ప కూడు

### కాంగ్రెస్ ఏడాది పాలన ఘనత

■ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**జయభేరి, హైదరాబాద్, మార్చి 5:**

తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ ఆధీనంలో ఉన్న 400 ఎకరాలనిక తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. రూ. 25 వేల కోట్ల ఆదాయం సమకూర్చుకునే ప్రణాళికల్లో భాగంగా వేలం కోసం ప్రకటన కూడా విడుదల చేసింది. కాగా ఈ భూముల

...మిగతాది 2 లో



# కల్పన ఆత్మహత్యకు కారణం ఏమిటీ..?

**జయభేరి, హైదరాబాద్, మార్చి 5:**

టాలీవుడ్ మ్యూజిక్ ఇండస్ట్రీ ఒక్కసారి షాక్‌కి గురయింది. ప్రముఖ గాయని కల్పన ఆత్మహత్యకు పాల్పడటం తెలుగు చలన చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్ అయింది. బలవన్మరణానికి పాలు పడాల్సిన అవసరం ఆమెకు ఏం వచ్చింది? ఎందుకు ఈ పని చేశారు? అనే కారణాలు తెలియాల్సి ఉంది.

...మిగతాది 2 లో

# ఆగని మల్టీ మార్కెటింగ్ మోసాలు

2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఏపీకి మళ్లీ మోడీ

చేసుకున్నట్లు తెలుస్తోంది.ఈ ఐదేళ్లలో ఈ ప్రాజెక్టు కోసం డిఆర్డి 15 వేల కోట్ల నుంచి 20వేల కోట్ల వరకు ఖర్చు చేసే అవకాశం కనిపిస్తోంది. ఇక్కడ క్షిపణి పరీక్షా కేంద్రం ఏర్పాటుకు అనుకూలమని 2011లోనే తేలింది. 2017లో భూ కేటాయింపులు జరిగినా..మిగతా పనులు నిలిచాయి.వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో రాష్ట్ర ప్రభుత్వంతో కేంద్రం చర్చించింది. శంకుస్థాపనకు తానే వస్తానని మోడీ స్వయంగా అంగీకరించారు.కానీ ఎందుకో అప్పటి వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దగా ఆసక్తి చూపలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో సానుకూలత చూపింది. దీంతో ప్రధాని మోడీ సైతం శంకుస్థాపనకు సిద్ధపడ్డారు. అదే విషయంపై కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వపరంగా ప్రధాని మోదీ పర్యటనకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి.దేశంలోనే ఆంధ్రప్రదేశ్ కు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు అవుతోంది. ఇప్పటికే విశాఖ జిల్లాలో 2 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి శంకుస్థాపన చేశారు ప్రధాని మోదీ. ప్రత్యేక రైల్వే జోన్ కు సైతం శంకుస్థాపన చేసి ఏపీ పై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు.అయితే గత రెండుసార్లు కంటే ఈసారి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు ఏపీకి. ఎన్డీఏలో టిడిపి కీలక భాగస్వామి కావడంతోనే ప్రాధాన్యత ఇస్తున్నట్లు గెలుస్తోంది. అయితే మిగతా రాష్ట్రాలు మాత్రం ఈ విషయంలో పెదవి విరుస్తున్నాయి. కేవలం ఏపీకి మాత్రమే ప్రాధాన్యం ఇస్తుండడాన్ని ప్రశ్నిస్తున్నాయి.

## వచ్చే నెల నుంచి అమలు

ట్రంప్ తాజాగా ప్రకటించారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి కాంగ్రెస్ సంయుక్త సెషన్‌లో ట్రంప్ ప్రసంగించారు. ఈ సందర్భంగా పదవి చేపట్టిన తర్వాత తాను చేసిన పనులు, సాధించిన విజయాల గురించి వివరించారు. ఇదే మీటింగ్‌లో భారత్, చైనా సహా పలు దేశాలపై విధించిన ప్రతీకార సుంకాలు వచ్చే నెల 2 నుంచి అమలు చేస్తామని వెల్లడించారు.కొన్ని దేశాలు దశాబ్దాల పాటూ అమెరికాపై టారిఫ్‌లు విధుస్తున్నట్లు ట్రంప్ ఈ సందర్భంగా తెలిపారు. యూరోపియన్ యూనియన్, చైనా, బ్రెజిల్, భారత్ వంటి చాలా దేశాలు తమ నుంచి అధిక సుంకాలు వసూలు చేస్తున్నట్లు చెప్పారు. ఇది చాలా అన్యాయమన్నారు. భారత్ తమపై 100 శాతం కంటే ఎక్కువ టారిఫ్‌లు వసూలు చేస్తున్నట్లు చెప్పారు. 'భారత్ మాపై 100 శాతం కంటే ఎక్కువ సుంకాలను వసూలు చేస్తోంది. మా ఉత్పత్తులపై చైనా సగటు సుంకం మనం వసూలు చేసే దానికంటే రెండింతలు ఎక్కువ. ఇక దక్షిణ కొరియా సగటు సుంకం నాలుగు రెట్లు ఎక్కువగా ఉంది. ఇప్పుడు మనకు సమయం వచ్చింది. ఏప్రిల్ 2 నుంచి ఆయా దేశాలపై ప్రతీకార సుంకాలు ఉంటాయి. ఆయా దేశాలు మన ఉత్పత్తులపై ఎంత టారిఫ్‌లు విధిస్తే మనమూ తిరిగి అంతే వసూలు చేస్తాం' అని ట్రంప్ స్పష్టం చేశారు.

## ఎకరం 50 కోట్లు

అభివృద్ధి చేసి దశలవారీగా విక్రయించనున్నారు. అత్యంత ఖరీదైన వెస్ట్ జోన్ పరిధిలో, ఐటీ కంపెనీలకు అతి సమీపంలోని ఈ భూమి ఉంది. హైటెక్ సిటీ నుంచి 78 కి.మీ, పంజాగుట్ట క్రాస్‌రోడ్స్ నుండి 1518 కి.మీ, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి 22 కి.మీ, శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి దాదాపు 33 కి.మీ దూరంలో ఈ స్థలం ఉంది. అక్కడి లేఔట్లలో గజానికి గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు పలికే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తుంది. ఎకరాల్లో అయితే ఎకరం రూ. 50 కోట్లు పలుకుతుందని అంచనా.లేఔట్ మాస్టర్ ప్లాన్ తయారీ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, వేలం ద్వారా ప్లాట్ల విక్రయాలు తదితర కార్యక్రమాల నిర్వహణ కోసం తాజాగా.. రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్‌ని ఆహ్వానించారు. క్వాలిటీ కమ్ కాస్ట్ బేస్డ్ సెలక్షన్ (క్యూసీబీఎస్) పద్ధతిలో బిడ్డర్‌ను ఎంపిక చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, భూములు వేలం ద్వారా వచ్చే రూ.20 వేల కోట్లను రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సహా ఇతర పథకాల కోసం వెచ్చించనున్నట్లు తెలిసింది.

## రంగనాయక సాగర్ ప్రాజెక్టును..

ప్రయత్నం చేశారు. అధికారంలోకి వచ్చారు.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలు అయింది. ఈ 15 నెలల్లో మేడిగడ్డలో పొంగిన పిల్లర్లను బాగు చేసే తీరిక ప్రభుత్వానికి లేదు. నేడు గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నాయి.. ఆ నీళ్లను లిఫ్ట్ చేసి లక్షల ఎకరాల పంటను కాపాడే అవకాశం ఉంది. కెసిఆర్ మీద కోపంతోనే, టిఆర్ఎస్ మీద కోపంతోనే, తెలంగాణ రైతులకు అన్యాయం చేయకూడదని ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. ఈ ప్రాంతంలో 500 1000 ఫీట్ల బోర్లు వేసినా నీళ్లు వచ్చే పరిస్థితి ఉండేది కాదు. ఈరోజు రంగనాయక సాగర్ కింద, అనంతసాగర్ కింద, మల్లన్న సాగర్ కింద పండే పంట కాళేశ్వరం పంట కాదా? కళ్లు ఉండి కల్లు లేని కబోధుల్లా... చెవులు ఉండి చెవిటివాళ్లలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుంది. పెండింగులో ఉన్న పంట కాలువల పనులు పూర్తి చేయాలని అన్నారు. కాలేశ్వరం కుంగింది అన్నవారికి, ఈ నీళ్లు ఎక్కడి నుంచి వచ్చాయి? రైతులతో పాటు మత్స్య సంపద కూడా పెరిగి, మత్స్యకారులకు ఆదాయం వస్తుంది. అన్ని వర్గాలకు మంచిచేసే ఇలాంటి ప్రాజెక్టును నిర్లక్ష్యం చేయకూడదు. కాలేశ్వరం తెలంగాణకి వరప్రదయిని. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు కండ్లు తెరవండి.. లేదంటే చరిత్ర మిమ్ములను క్షమించదని అన్నారు.

## అప్పు చేసి చిప్ప కూడు

అమ్మకంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్ ద్వారా స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అప్పు చేసి, పప్పు కూడు నాటి సామెత అని..అప్పు చేసి చిప్ప కూడు నేటి కాంగ్రెస్ ఏడాది పాలన ఘనత అని రాసుకొచ్చారు. అలాగే బీఆర్ఎస్ హయాంలో అప్పు చేసి 70 లక్షల అన్నదాతలకు అండగా నిలిచి, రైతుబంధు కింద రూ.73 వేల కోట్లు ఖాతాల్లోకి వేసి రూ.28 వేల కోట్లు రుణమాఫీ, రూ.6 వేల కోట్లతో రైతు బీమా, లక్ష 11 వేల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం, వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు, పారిశ్రామిక, గృహావసరాలకు 24 కరెంట్.. తో పాటు కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల, సీతారామ సాగర్ కట్టి 45 వేల చెరువులు కుంటలు బాగుచేసి. 45 లక్షల మందికి పైగా ఆసరా ఫించన్లతో అండగా నిలిచామని అన్నారు. అలాగే కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, కళ్యాణలక్ష్మి, వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలు 30 మెడికల్, నర్సింగ్ కాలేజీలు, ఏర్పాటు చేస్తే.. అప్పులు తప్పని కాంగ్రెస్ నేతలు రాద్ధాంతం చేశారు. కానీ ఇప్పుడు.. కాంగ్రెస్ 15 నెలల పాలనలో రూ.1.65 లక్షల కోట్లు అప్పు చేసి కూడా.. రుణమాఫీ, రైతుబంధు ఎగ్గొట్టారని, రైతులకు రైతు బీమా లేకుండా చేసి, కరెంటు కోతలు విదిస్తున్నారని, గురుకులాలను గాలికి వదిలేసారని, కాళేశ్వరాన్ని ఎండబెట్టి, పాలమూరు రంగారెడ్డిని పడావు పెట్టారని కేటీఆర్ తన ట్వీట్ లో మండిపడ్డారు. గల్లీలో గాలి మాటలు.. ఢిల్లీకి ధనం మూటలు మోసుడు తప్ప 15 నెలల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏంటిని ప్రశ్నించారు. నాడు అప్పులు తప్పని అబాండాలు వేసిన వారే ఇప్పుడు అందినకాడికి అప్పులు చేస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ తన ట్వీట్ లో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

## కల్పన ఆత్మహత్యకు కారణం..

నిజాంపేటలో కల్పన నివాసం ఉంటున్నారు. ఒక గేటెడ్ కమ్యూనిటీలోని విల్లా తీసుకుని జీవిస్తున్నారు. ఆ విల్లాలో నిద్ర మాత్రలు మింగి ఆవిడ ఆత్మహత్యకు పాల్పడ్డారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను పోలీసులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం కల్పన అపస్మారక స్థితిలో ఉన్నారని తెలిసింది. ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.కల్పన ఆత్మహత్యకు పాల్పడిన సమయంలో ఆమె భర్త చెన్నైలో ఉన్నట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. రెండు రోజులుగా విల్లా గేట్లు ఓపెన్ చేయకపోవడంతో అసోసియేషన్ సభ్యులకు సందేహం కలిగి ఆవిడకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదట. దాంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వాళ్ళు వచ్చి గేట్లు ఓపెన్ చేయగా... కల్పన అపస్మారక స్థితిలో ఉన్నారట.ప్రస్తుతం కల్పనకు వెంటిలేటర్ మీద వైద్యులు చికిత్స అందిస్తున్నారని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఆవిడ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందట. కొన్ని గంటలు గడిస్తే గానీ ఏ విషయం చెప్పలేమని చెప్పారట. మలయాళ ఛానల్ ఏషియానెట్ నిర్వహించిన 'స్టార్ సింగర్' సీజన్ 5 విజేతగా నిలిచారు. ఆ షో 2010లో జరిగింది. దానికి 20 ఏళ్ళ ముందు నుంచి ఆవిడ పాటలు పాడుతున్నారు. తెలుగు 'బిగ్ బాస్' సీజన్ 1లో కూడా పార్టిసిపేట్ చేశారు. కల్పనను ఆస్పత్రికి తరలిస్తున్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అందులో ఆవిడ ఫేస్ చూసి ఆడియన్స్ షాక్ అవుతున్నారు. కల్పన ముఖం అంతలా మారిందేమిటి? అని ఆశ్చర్యపోతున్నారు. ఆవిడ త్వరగా కోలుకోవాలని పరిశ్రమ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు. కల్పన ఆత్మహత్యకు పాల్పడిన సమయంలో విల్లాలో ఇతరులు ఎవరైనా ఉన్నారా? ఆవిడ కుటుంబ సభ్యులు ఎక్కడ ఉన్నారు? పోలీసులకు కల్పన ఆత్మహత్యకు పాల్పడిన సమాచారం ఎవరు అందించారు? అనేది తెలియాల్సి ఉంది.

# ఆగని మల్టీ మార్కెటింగ్ మోసాలు

**పెట్టుబడి తక్కువ.. లాభాలు ఎక్కువ! తక్కువ టైమ్‌లో.. ఎక్కువ ఆదాయం! ఇంట్లో నుంచే.. బీరువాల నిండా సంపాదించండి! ఇలాంటి ప్రకటనలతో.. ముందూ వెనకా ఆలోచించకుండా.. అత్యాశకు పోయి ఎంతో మంది భారీగా నష్టపోతున్నారు. నెట్‌వర్కింగ్ పేరుతో కొందరు కేటుగాళ్లు నట్టేట ముంచేస్తున్నారు.**




బిజినెస్, ప్రొడక్ట్, మార్కెటింగ్ అంటూ తెలివిగా మోసం చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో.. ఈ తరహా మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోసాలు పెరిగిపోయాయ్. ఇప్పటికైనా మేలుకోని.. తేరుకోకపోతే.. భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిస్తున్నారు.తక్కువ టైంలో ఎక్కువ లాభాలు ఆర్జించొచ్చు. ఎంతమంది ఏజెంట్లని చేర్పిస్తే అన్ని రివార్డులు, పాయింట్లు, రిఫర్ చేస్తే బోనస్‌లు వస్తాయని ఆశ చూపే దందాలు ఈ మధ్యకాలంలో ఎక్కువైపోయాయ్. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. ఈ దేశంలో మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోసాలు మళ్లీ పెరుగుతున్నాయ్. వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులు, హెర్బల్ ప్రొడక్ట్స్, హెల్త్ కేర్ ఉత్పత్తులు, క్రిప్టోకరెన్సీ, నిత్యవసర వస్తువులు, ఎలక్ట్రానిక్ ప్రొడక్ట్స్, ఎలక్ట్రిక్ బైకుల అమ్మకాల పేరిట అడ్డంగా మోసం చేస్తున్నారు. పిరమిడ్ మోడల్ తరహా మోసాలు చేసే కేటుగాళ్లంతా.. ఇప్పుడిదే పనిలో ఉన్నారు. తమ దగ్గర ప్రొడక్టులు కొని మార్కెట్‌లో విక్రయిస్తే.. భారీ లాభాలు వస్తాయని చెప్పి.. జనం ఆశల్ని, అమాయకత్వాన్ని క్యాష్ చేసుకునే ఏజెంట్లు ఎందరో ఉన్నారు.వికెన్, ఆమ్‌వే, క్యూ నెట్, వెస్టీజ్, హెర్బల్ లైఫ్, సంకల్ప్ మార్ట్, DKZ టెక్నాలజీస్, ఫ్రైడే అప్ కన్సల్టెన్సీస్.. ఇలా చెప్పుకుంటూ పోతే లిస్ట్ చాంతాడంత ఉంటుంది. ఈ జాబితాలోనే ఇప్పుడు చేసింది ఏడీఎంఎస్ ఇబైక్స్.. ప్రతిసారీ కంపెనీ పేరు మారుతుంది. దాని బిజినెస్ మారుతుంది. అందులోని స్కీమ్ మారుతుంది కానీ..స్కామ్ మాత్రం మారదు. అదే స్క్రిప్ట్, అదే సినిమా. అందులో క్యారెక్టర్స్ మారతాయి కానీ.. మోడల్ మారదు. లైఫ్‌లో సక్సెస్ అయ్యేందుకు.. దీనిని మించిన అవకాశం మరొకటి లేదు.. రాదు అని కథలు చెబుతారు. మిమ్మల్ని మోటివేట్ చేస్తారు. బ్రెయిన్ వాష్ చేస్తారు.వాళ్ల దారిలోకి తెచ్చుకుంటారు. మనల్ని మోసం చేయడమే కాదు.. మన చేత మరో నలుగురైదుగురిని మోసం చేయమని చెబుతారు. డబ్బుల మీదున్న ఆశతో.. ఎంతో మంది అమాయకులు ఈ మల్టీ లెవెల్ మార్కెటింగ్ కంపెనీల ఏజెంట్లు చెప్పింది విని మోసపోతున్నారు. వాళ్లు చెప్పినట్లుగా చేస్తూ.. మిగతా వాళ్లు కూడా నష్టపోయేందుకు కారకులవుతున్నారు.

> **ఈజీగా మనీ వస్తుందని ఆశపడితే.. తర్వాత నష్టపోవాల్సిందే మీరేనని మార్కెట్ నిపుణులు, పోలీసులు హెచ్చరిస్తున్నారు.ఈ మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోడల్‌లో.. కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన స్కామే.. ఏడీఎంఎస్ ఈబైక్స్. బైక్‌ల పేరుతో వ్యాపారం మొదలుపెట్టిన కంపెనీ.. ఆ బైక్‌లు అమ్మకుండా.. చైన్ మార్కెటింగ్ వ్యాపారం చేస్తోంది.**

ఇలా.. వందల కోట్లలో వసూలు చేసి.. బోర్డు తిప్పేసిన కంపెనీల లిస్టు చాలానే ఉంది. ఈజీగా మనీ వస్తుందని ఆశపడితే.. తర్వాత నష్టపోవాల్సిందే మీరేనని మార్కెట్ నిపుణులు, పోలీసులు హెచ్చరిస్తున్నారు.ఈ మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోడల్‌లో..కొత్తగా మార్కెట్ లోకి వచ్చిన స్కామే.. ఏడీఎంఎస్ ఈబైక్స్. బైక్‌ల పేరుతో వ్యాపారం మొదలుపెట్టిన కంపెనీ.. ఆ బైక్‌లు అమ్మకుండా.. చైన్ మార్కెటింగ్ వ్యాపారం చేస్తోంది. రిజిస్ట్రేషన్, మెంబర్‌షిప్, ఐడీ జనరేషన్ అని చెబుతూ.. జనాల నుంచి డబ్బులు వసూలు చేసి.. వారినే మార్కెటింగ్ ఏజెంట్లుగా మార్చేస్తోంది. జనం డబ్బుతో.. వాళ్లు వ్యాపారం చేస్తూ.. వేల కోట్లు వెనకేస్తున్నారు. కొద్దో గొప్ప డబ్బులకు ఆశపడి.. ఈ స్కీమ్‌లో ఏజెంట్లుగా చేరుతున్న వాళ్లెందరో ఉన్నారు.ఎప్పుడైతే.. సైబర్ మోసాలపై జనంలో అవగాహన పెరగడం మొదలైందో.. కేటుగాళ్లంతా ఈ మల్టీ లెవెల్ మార్కెటింగ్‌పై కన్నేశారు. చైన్ బిజినెస్ పేరుతో.. సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ ద్వారా ప్రకటనలు గుప్పించి.. అమాయకులను మోసగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మల్టీలెవెల్ మార్కెటింగ్ స్కీములు నడిపే కేటుగాళ్లలో.. చాలా మంది మంది విదేశాల్లోనే ఉండి ఈ పిరమిడ్ రాకెట్ నడుపుతుంటారు. భారీ లభాలతో పాటు లగ్జరీ కార్లు, ఫారిన్ టూర్ల పేరిట.. ఏజెంట్ల ద్వారా అమాయకులకు వల వేస్తున్నారు.ఈ మల్టీలెవెల్ మార్కెటింగ్ మోసాలన్నీ.. స్టాలిన్ సినిమా తరహాలోనే ఉంటాయ్. నువ్వో ముగ్గురికి సాయం చెయ్.. ఆ ముగ్గురిని మరో ముగ్గురి చొప్పున సాయం చేయమని చెప్పండి లాగే ఉంటుంది వ్యవహారం. ఇలా చైన్ సిస్టమ్ ద్వారా డబ్బులు కట్టించుకోవడం, పెద్ద మొత్తంలో జమ అయ్యాక జెండా పీకేయడం ఎన్నో ఏళ్లుగా జరుగుతున్నదే! ఇప్పుడు.. ఈబైక్స్ పేరుతో ఏడీఎంఎస్ చేస్తున్నది కూడా ఇదే దందా. కొన్ని కంపెనీలు తమ దగ్గర ప్రొడక్ట్స్ కొని.. మార్కెట్‌లో సేల్ చేసుకోమని చెబుతాయ్. ఇంకొన్ని.. కచ్చితంగా ప్రతి నెలా తమ ఉత్పత్తుల్ని కొనాల్సిందే అంటాయ్. తర్వాత.. మిగతా వాళ్లని కూడా చేర్పించమని చెబుతాయ్. కానీ.. ఏడీఎంఎస్ అలా కాదు.మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీమ్స్ చాలా డిఫరెంట్‌గా ఉంటాయ్. ఈ కంపెనీలు.. తమ డైట్ సప్లిమెంట్ల నుంచి క్లీనింగ్ ప్రొడక్ట్స్ వరకు ఏవైనా జనం భారీగా కొనుగోలు చేసే అవకాశం కల్పిస్తాయ్. ఆ తర్వాత వీటిని సేల్ చేయడం ద్వారా ప్రజలు ఆదాయాన్ని సంపాదించే వీలుందని చెబుతాయి.

నిజానికి ఇలాంటి కొన్ని స్కీమ్‌లలో భారీగా ఏజెంట్లను నియమించుకోవడం ద్వారా కంపెనీలు డబ్బులు సంపాదిస్తూ ఉంటాయ్. కింది స్థాయిలో జనం పెట్టే డబ్బు ద్వారానే.. పైస్థాయిలో ఉండేవారికి లాభాలు వస్తుంటాయ్.అయితే.. అతి తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని ఎవరైనా చెబితే.. కచ్చితంగా అది మోసమేనని గ్రహించాలి. లేకపోతే.. మిమ్మల్ని ఆ స్కామ్‌లోకి దించి.. మీ డబ్బులు కొల్లగొడతారు. అత్యాశకు పోతే మోసపోవడం ఖాయం. ఈ చైన్ మార్కెటింగ్‌లో.. ముందు చేరిన వారికే లాభాలు వస్తాయి. ఆ తర్వాత చేరిన వారంతా తీవ్రంగా నష్టపోవాల్సిందే. అందువల్ల.. ఇలాంటి నెట్ వర్క్‌ల్లో ఎవరూ చేరొద్దు. ఆ కంపెనీలు పెట్టే మీటింగ్‌లకు కూడా వెళ్లొద్దు. ముఖ్యంగా సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలి. మోసపూరిత ప్రకటనలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు పోలీసులు. పిరమిడ్ విధానంలో చేసే మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీమ్‌ల్లో.. మొదట జాయిన్ అయిన వారికే డబ్బులొస్తాయని చెబుతున్నారు. కొన్నాళ్ల తర్వాత.. చివరికి జాయిన్ అయినవారు పెద్ద ఎత్తున నష్టపోతారని హెచ్చరిస్తున్నారు.ఒకప్పుడు వారం స్కీములు, నెలవారీ లాటరీలు అంటూ మోసం చేసేవారు. మాయమాటలు చెప్పి డబ్బులు కట్టించుకునేవారు. తర్వాత.. పెద్ద మొత్తంలో జమవగానే ఆ సొమ్ముతో ఉడాయించేవారు. ఇప్పుడు.. రోజులు మారాయ్. టెక్నాలజీ పెరిగింది. అంతా హైలెవెల్ మార్కెటింగ్ మోసాల ట్రెండ్ నడుస్తోంది. తక్కువ పెట్టుబడి.. ఎక్కువ సంపాదన! కూర్చున్న చోటే.. కాసుల వర్షం! లాంటి ఏదో ఒక స్కీమ్ పేరుతో.. భారీ స్కామ్‌లకు పాల్పడుతున్నారు కేటుగాళ్లు. అందువల్ల.. మల్టీ లెవెల్ మార్కెటింగ్ బిజినెస్‌ల జోలికి వెళ్లొద్దని నిపుణులు సూచిస్తున్నారుఇలా నిబంధనలకు విరుద్ధంగా నడిచే ఈ విధమైన స్కీమ్‌లకు వ్యతిరేకంగా ఎన్నో చట్టాలున్నాయ్. ప్రధానంగా.. సెమీ అర్బన్, రూరల్ ఏరియాల్లోని ప్రజల్ని ఆకర్షించి ఈ స్కీముల్లో జాయిన్ చేస్తున్నారు. హోటల్స్, ఫంక్షన్ హాల్స్‌లో మీటింగ్స్ ఏర్పాటు చేసి.. వీటి గురించి చెబుతుంటారు. ఇలాంటి స్కీముల్లో ఎవరూ చేరొద్దు. ఒకవేళ మీ దగ్గరలో ఇలాంటి మీటింగులు జరిగితే.. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి.

# కార్పొరేషన్ చైర్మన్ పదవి కావాలంటే..

- పార్టీ అంతర్గత విషయాలు మీటింగ్‌లోనే చెప్పాలి
- గాంధీభవన్ బయట మాట్లాడొద్దు
- అసంతృప్తులకు మీనాక్షి నటరాజన్ అల్టిమేటం

**జయభేరి, హైదరాబాద్, మార్చి 5 :**

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ స్థితిగతులు, ఫలితాలపై రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ సమీక్షించారు. పార్టీ పరిస్థితిపై క్షేత్రస్థాయిలో ఆరా తీశారు. కార్పొరేషన్ చైర్మ న్ పదవి కావాలంటే పదేళ్లు కాంగ్రెస్ పార్టీలో పని చేసి ఉండాలని, కార్యకర్తలను ఎలా వాడుకోవా లో తెలుసని, పార్టీ విజయం కోసం కష్టపడిన అం దరికీ న్యాయం చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన కొత్త వారిని కలుపుకు పోతామన్నారు. పార్టీ అంతర్గత విషయాలు మీటింగ్‌లోనే చెప్పాలని గాంధీభవన్ బయట మాట్లాడొద్దని ఆమె సూచించారు. అలాగే మంత్రులు తప్పొప్పులు కూడా మీటింగ్‌లోనే చె ప్పాలని అంతేకానీ ప్రత్యేక సమావేశాలు పెట్టడం సోషల్ మీడియాలో పెట్టడం వంటివి చేసి పార్టీ, ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయొద్దన్నారు.పార్టీ లైన్ దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఇకపై ఎవరైనా గొడవ పడినా, పార్టీపై బహిరంగంగా కామెంట్స్ చేసినా ఊరుకునే ప్రసక్తే లేదని నేతలకు ఆమె వార్నింగ్ ఇచ్చారు. ఇన్ చార్జీల వల్లే సమస్యలు వస్తే పదవి నుంచి తొలగిస్తామని ఆమె హెచ్చరించారు. నియోజక వర్గ ఇన్‌చార్జీలు బాధ్యతాయుతంగా వ్యవహారించి అందరినీ కలుపుకుపోవాలన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యేలు ఎల్ల వేళలా ప్రజలకు అందు బాటులో ఉండాలని ఆమె సూచించారు. పటాన్‌చెరులో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తమను ఇబ్బంది పెడుతున్నారని కాట శ్రీనివాస్ గౌడ్ మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేశారు. సమస్య పరిష్కారం కోసం కమిటీ వేసినా ఇప్పటివరకు రిపోర్టు ఇవ్వలేదంటూ ఆయన మీనాక్షి నటరాజన్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా సమస్య పరిష్కరించాలంటూ మీనాక్షి నటరాజన్‌కు కాట శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

**బిఆర్ఎస్ నేతలే అధికారం చెలాయిస్తున్నారు : మీనాక్షి ఎదుట నాయకుల ఆవేదన**

అధికారులు తమ మాట వినడం లేదని మరికొందరు నేతలు ఎమ్మెల్యే మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేశారు. ఇంకా బిఆర్ఎస్ నేతలే అధికారం చెలాయిస్తున్నారని నాయకులు ఆమె ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఇందిరమ్మ ఇళ్లు అయినా తాము చెప్పిన వారికి ఇస్తే గౌరవం ఉంటుందని మీనాక్షి నటరాజన్‌కు పలువురు నేతలు విజ్ఞప్తి చేశారు.ఈ సమీక్షలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం



14 నెలల ప్రజాపాలనలో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై మీనాక్షి నటరాజన్ చర్చించారు. చారిత్రాత్మక నిర్ణయాలైన కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణ పైనా ఆమె అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉందని ఆమె ఆరా తీశారు. సంస్థాగతంగా పార్టీ నిర్మాణం, కమిటీల ఏర్పాటుపైనా కీలకంగా ఆమె చర్చించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలకు మీనాక్షి దిశానిర్దేశం చేశారు. పార్టీలో పాత, కొత్త నేతల మధ్య సమన్వయం లోపించకుండా ఐక్యంగా ముందుగు సాగాలని ఆమె హితవు పలికారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆమె సూచించారు. ఈ సమీక్షలో ఏఐసిసి ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డిసిసి అధ్యక్షులు, పోటీ చేసిన అభ్యర్థులు, కాంగ్రెస్ అనుబంధ సంఘాలు చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



# సీఎం చంద్రబాబును కలిసిన ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ శ్రీనివాసులు

**జయభేరి, అమరావతి, మార్చి 5 :**

ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీగా విజయం సాధించిన గాదె శ్రీనివాసులు నాయుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిశారు. ఉండవల్లి నివాసంలో సీఎంను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తన విజయానికి అన్ని విధాలా సహకరించినందుకు సీఎంకు, కూటమికి శ్రీనివాసులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులును సీఎం అభినందించారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంతో పాటు, వారిని అన్ని వేళలా గౌరవిస్తామని ముఖ్యమంత్రి అన్నారు. టీచర్ల సమస్యల పరిష్కారానికి మంత్రి నారా లోకేష్ విశేషంగా కృషి చేస్తున్నారని, ప్రభుత్వ పాలసీల రూపకల్పన విషయంలో ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాకే నిర్ణయాలు తీసుకుంటున్నామని సీఎం అన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, నాణ్యమైన బోధనకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. సీఎంను కలిసిన వారిలో బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, పీఆర్‌టీయు రాష్ట్ర అధ్యక్షులు మిట్టా కృష్ణయ్య, ఏపీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ బాలజీ, ఆప్టా రాష్ట్ర అధ్యక్షులు ఏజీఎస్ గణపతి రావు, ఎస్టీయు విశాఖ జిల్లాకార్యదర్శి ఇ.పైడి రాజు, ఏపీటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎష్.సదాశివరావు, ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ గుజ్జల తిరుపాల్, గుంటూరు జిల్లా పీఆర్‌టీయు అధ్యక్షులు జీవీఎస్ రామకృష్ణ, రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కాశీ విశ్వేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

# మైసమ్మగూడలో యథేచ్ఛగా అక్రమ నీటి దందా

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- ట్యాంకర్లతో నీటి తరలింపు
- ధనార్జనే ధ్యేయంగా నీటి వ్యాపారం
- చోద్యం చూస్తున్న అధికారులు

**జయభేరి, మేడ్చల్ :**

వేసవి ప్రారంభంలోనే ఎండలు దంచికొట్టడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. దీంతో వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదన్న అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతోంది. ప్రజల తాగునీటి అవసరాలను కొందరు వ్యాపారంగా మార్చుకుంటున్నారు. అక్రమార్జనే ధ్యేయంగా అనధికార బోర్లు ఏర్పాటు చేసి ప్రజలను దోచుకుంటున్నారు. ఒక్కో పాయింట్ ద్వారా రోజుకు పది నుంచి ముప్పై ట్యాంకర్ల వరకు అక్రమంగా నీటిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ తతంగమంతా ఏ మారుమూల ప్రాంతంలో జరుగుతుందనుకుంటే పొరపాటుపడ్డట్లే ఇది నగర శివారు ప్రాంతమైన మైసమ్మగూడలో యథేచ్ఛగా నీళ్ల వ్యాపారం జోరందుకుంది. కొందరు భూగర్భజలాలు తోడేస్తూ వాల్టా చట్టానికి వ్యతిరేకంగా ట్యాంకర్ల ద్వారా నీటి విక్రయాలు చేస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. నీటి పొదుపును పటిస్తున్నాం, నీటి ఎద్దడిని రాకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటున్నాం, వాల్టా చట్టాన్ని పక్కాగా అమలు చేస్తున్నామంటూ అధికారులు ప్రచారం చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అది కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



## విచ్చలవిడిగా బోర్ల తవ్వకం

మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిదిలోని మైసమ్మగూడలో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. దీనికీ ప్రధాన కారణం మైసమ్మగూడలో పలు విద్యాసంస్థలు ఉండటంతో ఇక్కడ విద్యార్థి వసతి గృహాలు వందల సంఖ్యలో నిర్మాణాలు జరిగాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన బహుళ అంతస్తుల ప్రతి భవనానికి ఒక్కో బోరు తవ్వడంతో ఎండాకాలం రాకముందే నీటి ఎద్దడి మొదలైంది. వేల సంఖ్యలో ఉన్న విద్యార్థులకు అవసరమైన నీటి వసతికి ఉన్న డిమాండ్ ను గమనించిన కొందరు దళారులు వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ ట్యాంకర్ల ద్వారా ఒక్కో హాస్టల్ కు రోజుకు ఐదు చొప్పున నీటిని సరఫరా చేస్తూ క్యాష్ చేసుకుంటున్నారు. పర్యావరణాన్ని కాపాడి భూగర్భజలాల మట్టలు పడిపోకుండా తీసుకునే జాగ్రత్తల్లో భాగాంగా ప్రభుత్వం వాల్టా చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ నిబంధనల ప్రకారం అనుమతి లేనిదే ఇసుక తీయకూడదు, బోర్లు తవ్వకూడదు ఒకవేళ తప్పని పరిస్థితుల్లో వేస్తే బోరు బావికి కనీసం 100 మీటర్ల దూరం మాత్రమే కొత్త బోరు వేయాలని నిభందనలు చెబుతున్నాయి. కానీ మైసమ్మగూడలో పరిస్థితులు చూస్తుంటే వాల్టా చట్టం ఉందా అని అనుమానాలు కలుగుతున్నాయి. మైసమ్మగూడలో రోజుకో భవనం నిర్మాణం చేస్తూ ఎక్కడ చూసినా బోర్ల తవ్వకాల శబ్దాలు వినిపిస్తున్నాయి. ఇది ఇలానే కొనసాగుతూ ఉంటే వచ్చే తరాలకు నీటి కటకటా తప్పదనిపిస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## వాల్టా చట్టం ఇలా...

నీరు, భూమి, వృక్షాల సంరక్షణకు రూపొందించిన ప్రత్యేక చట్టాన్ని పక్కాగా అమలు చేయాల్సిన అవసరముంది. వాటర్ ల్యాండ్ ట్రీస్ ఆక్ట్ (వాల్టా)గా రూపొందించిన చట్టాన్ని పట్టించుకోవడం లేదు. ఈ చట్టం బోరు బావులకు సంబంధించిన అనేక నిబంధనలను తయారు చేసింది. ఎవరైనా సరే బోరు బావి తవ్వుకోవాలంటే ముందుగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. సర్వే నంబరు ఆధారంగా రెవెన్యూ సిబ్బంది బోరు వేసే ప్రాంతాన్ని పరిశీలిస్తారు. తదుపరి ఆ అప్లికేషన్‌ను భూగర్భ జల వనరుల శాఖకు పంపుతారు. అక్కడి టెక్నికల్ అధికారి సర్వే చేసి ఆ ప్రాంతం లో నీరు పడుతాయని ధృవీకరిస్తే అప్పుడు బోరు వేసుకోవడానికి అనుమతినిస్తారు. ఒక వేళ బావిలో నీరు పడకపోతే ఆ బావిని పూర్తిగా పూడ్చివేయాలి. ఇంత పకడ్బందీగా వాల్టా చట్టం రూపొందించినప్పటికీ పలువురు పట్టించుకోవడం లేదు. ఇంట్లో వేసుకునే బోర్లకు సైతం అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అనుమతులు లేకుండా బోర్ల తవ్వకాలు చేస్తున్న వారిపై రెవెన్యూశాఖ చర్యలు తీసుకుంటుంది.








## ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలి

**జయభేరి, దేవరకొండ :**

కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడైన మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ కి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేతావత్ బాబురామ్ నాయక్ తెలిపారు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం లంబాడి సామాజిక వర్గానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు స్వరాష్ట్రం కోసం అహర్నిశలు కృషిచేసి తెలంగాణ ప్రజల కోసం అహర్నిశలు కృషి చేసినటువంటి వ్యక్తికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవీ బాధ్యతలు ఇచ్చి వారి గౌరవానికి తోడ్పడాలని తెలిపారు విలేకరుల సమావేశంలో ఆయన తెలిపారు లంబాడి సామాజిక వర్గంలో ఆయనను మించిన నాయకుడు మరొకరు లేరని ఆయన తెలంగాణ ఉద్యమం కోసం కృషి చేశారని అదేవిధంగా ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అహర్నిశలు కృషి చేశారని గతంలోనూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో కాన్షిరామ్ తో కలిసి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు ఎప్పుడు ఉద్యమాల్లో ఉండే వ్యక్తికి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఉంటే మా గిరిజనుల బతుకులు కూడా మారవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు రాములు నాయక్ మూడు సంవత్సరాల ఎమ్మెల్సీ పదవీకాలం ఉండగానే పదవిని సైతం త్యాగం చేసి బిఆర్ఎస్ పార్టీలో కుటుంబ పాలనకు , వ్యతిరేకంగా పోరాటం చేసి పార్టీని వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరినారు అలాంటి డైనమిక్ లీడర్ అలాంటి ధైర్యవంతుడు గిరిజనులకు ఎంతైనా అవసరం అలాగే కాంగ్రెస్ పార్టీకి కూడా అవసరమని భావిస్తూ ఇలాంటి వారికి పదవిని ఇచ్చి సత్కరించాలని ప్రభుత్వానికి లంబాడీల,బంజారాల తరఫున యువకులు మేధావులు మహిళలు అందరి తరపున ప్రత్యేకంగా కోరుకుంటున్నారు.

## మైనింగ్ పర్మిషన్ రద్దు చేయాలని గ్రామస్తుల ఆందోళన


**జయభేరి, సూర్యాపేట:**

తిరుమలగిరి మండలం తొండ గ్రామంలోని సర్వే నెంబర్ 98 లో ఇచ్చిన మైనింగ్ పర్మిషన్ రద్దు చేయాలని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఇదే సర్వే నెంబర్లు గతంలో రైతు వేదిక, డంపింగ్ యార్డ్, క్రీడా ప్రాంగణాలు అధికారులు ఏర్పాటు చేసారు. 330 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. ఇక్కడ మైనింగ్ పర్మిషన్ వస్తే భవనాలు పూర్తిగా దెబ్బతింటాయి, రైతులకు భూగర్భ జలాలు తగ్గుతాయి పంట పొలాలు దెబ్బతింటాయి. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. మైనింగ్ పర్మిషన్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేసిన రైతులు తొండ గ్రామ ప్రజలు ధర్నాకు దిగారు.

# అక్రమమట్టిని తరలిస్తున్న వారిపై కొరడా

- వాహనాలను సీజ్ చేసిన సిద్దిపేట టాస్కోర్స్ పోలీసు అధికారులు

**జయభేరి, మార్కుక్, మర్చి 05 :**



ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మండల పరిధిలోని కరకపట్ల గ్రామ శివారులో మట్టిని తవ్వి అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్లు, ట్రాక్టర్ మరియు జెసిపి ని బుధవారం సిద్దిపేట టాస్కోర్స్ పోలీసులు, మర్కుక్ పోలీసులు వాహనాలు సీజ్ చేసి అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట టాస్కోర్స్ పోలీస్ అధికారులు మాట్లాడుతూ సార శ్రీరామ్ తండ్రి మొగిలి, రషీద్ ఖాన్, గోండిల్ గణేష్ తండ్రి లక్ష్మయ్య, నూర్ అమీన్ తండ్రి హుస్సేన్, బింగి రాజు తండ్రి నరసయ్య, శంకర్ యాదవ్, మహమ్మద్ అలీఖాన్, బింగి నర్సింలు తండ్రి మల్లయ్య విరంతా కరకపట్ల గ్రామానికి చెందిన వారిగా కాశమైన వెంకటేష్ తండ్రి మల్లయ్య నివాసం గోపాల్ పూర్, నెల్లుట్ల నాగరాజు తండ్రి బిక్షపతి నివాసం రామ లింగంపల్లి,మొగుళ్ల నాగిరెడ్డి తండ్రి రాజిరెడ్డి నివాసం చీరాల,పై అందరూ నిందితులు కలసి టిప్పర్, హిటాచి లతో అక్రమ మట్టి రవాణా చేస్తున్నారని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అలాగే అక్రమ రవాణా చేసిన నిల్వ ఉంచిన, మట్టి తవ్వి అక్రమ రవాణా చేసిన చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూదం, గ్యాంబ్లింగ్ చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామాలలో, పట్టణాలలో ఇసుక అక్రమ రవాణా చేసిన, పిడిఎస్ రైస్ అక్రమంగా దాచిపెట్టిన రవాణా గ్యాంబ్లింగ్, పేకాట, గుట్కాలు కలిగి ఉన్న రవాణా చేసిన మరియు మరిఏదైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 87 12667446, 8712667447 లకు సమాచారం అదించాలని సూచించారు.

# పారిశుద్ధ్యము, నీటి సమస్యల నుండి పరకాలను కాపాడండి

- మున్సిపల్ కమిషనర్ కి బిజెపి పట్టణశాఖ వినతి

**జయభేరి, పరకాల, మార్చి 05:**



పరకాల మున్సిపాలిటీ పరిధిలో చెత్త సేకరణ వాహనాల ద్వారా (ఆటోలు , ట్రాక్టర్) చెత్త సేకరణలో జాప్యం చేస్తున్న కారణంగా పారిశుద్ధ్యం సక్రమంగా జరగనందున చెత్త చెదారంతో కాలువలు నిండి దోమల బారిన పడటం వలన ప్రజలు వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంది. మున్సిపాలిటీలో సరియైన సిబ్బంది ఉండి కూడా అధికారుల నిర్లక్ష్యం వలన పరకాల పట్టణం సమస్యలతో కొట్టుమిట్టాడుతుంది. అలాగే గతంలో కూడా పరకాల పట్టణానికి అనేక సంవత్సరాలుగా నీటి కొరత ఉండేది. ప్రభుత్వ అధికారులు సరియైన సమయంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం వలన తీవ్ర ఇబ్బంది పడేవారు. ఈ వేసవి కాలంలో పరకాల పట్టణ ప్రజలకు ఎలాంటి నీటి కొరత లేకుండా ముందు జాగ్రత్త వహించాలని, భారతీయ జనతా పార్టీ పరకాల పట్టణ శాఖ కమీషనర్ ను కోరడం జరిగింది. ఒకవేళ పరకాల పట్టణంలో కూరుకుపోయిన సమస్యలను అనగా పారిశుద్ధ్యము నీటి కొరత మొదలగునవి పట్టణ ప్రజలకు తమరు సరియైన సౌకర్యాలు కల్పించని యెడల, పరకాల పట్టణ ప్రజలతో మమేకమై భారతీయ జనతా పార్టీ ప్రజల పక్షాన సమస్యలు పరిష్కరించే వరకు పోరాడుతామని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు గాజుల నిరంజన్, పరకాల 9 వార్డు మాజీ కౌన్సిలర్ పూర్ణచారి, నాయకులు మార్త బిక్షపతి, కుక్కల విజయ్ కుమార్, సంగా పురుషోత్తం, బూత్ అధ్యక్షులు దామ సతీష్, ముత్యాల దేవేందర్, సారంగ నరేష్, ఉడుత చిరంజీవి, పల్లెబోయిన భద్రయ్య, బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా మెగా మేళా

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**

నాచారం డివిజన్ పరిధిలోని బద్ర గ్రాండ్ హోటల్ లో జరిగిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెగా మేళా లో మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ తో పాల్గొని MSME Outrech Camp ద్వారా లోన్ పొందిన లబ్దిదారులకు లోన్ కాపీ నీ అందజేయడం జరిగింది. ఈ సందర్భగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తన బ్యాంక్ అకౌంట్ కూడా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లోనే వుంది అని ఈ బ్యాంక్ ద్వారా అనేక ఉపయోగాలు ఉన్నాయి అని విద్యార్థుల లోన్ వల్ల పేద విద్యార్థులు కూడా బయటి దేశములో చదువుకునే అవకాశం వుంటుంది అని ఆయన అన్నారు. వినియోగదారులకు ఎల్లప్పుడూ వుండాలి అని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ భాస్కర్ రావు రఘునాథ్, సుధాకర్, పద్నాయక్, బ్యాంక్ సిబ్బంది, BRS పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజ్ పైప్ లైన్ తరచు పొంగి మురుగు నీరు రోడ్లపై..



**జయభేరి, ఎల్బీనగర్ :**

బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎస్ కే డి నగర్ లో డ్రైనేజ్ పైప్ లైన్ తరచు పొంగి మురుగు నీరు రోడ్లపై చేరి ఇబ్బందికరంగా ఉందని కాలనీవాసులు బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డికి సమాచారం ఇవ్వడంతో స్పందించిన కార్పొరేటర్ జలమండలి DGM రాజగోపాల్ తో కలిసి అట్టి డ్రైనేజ్ పైప్ లైన్ ను పర్యవేక్షించి వెంటనే నూతన పైప్ లైన్, మరమ్మతులు చేయించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ సిరివెన్నెల, వర్కి ఇన్స్పెక్టర్ రవీందర్, జయసింహ, నాయకులు ఠాగూర్, తదితరులు పాల్గొన్నారు.

## కండక్టర్ బుచ్చిరెడ్డి, డ్రైవర్ భోజ్య మానవత్వం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ ఆర్టీసీ డిపో కండక్టర్, డ్రైవర్లు బస్సులో దొరికిన పర్సును అధికారులకు అప్పగించి తమ నిజాయితీని చాటుకున్నారు. హైదరాబాద్ నుంచి కొండమల్లేపల్లికి ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడు తన పర్సును బస్సులో పోగొట్టుకున్నాడు. గమనించిన కండక్టర్ బుచ్చిరెడ్డి, డ్రైవర్ భోజ్య జాగ్రత్తగా భద్రపరిచి ఆర్టీసీ అధికారులకు అప్పగించారు. స్టేషన్ మేనేజర్ దీప్ లాల్ విచారణ జరిపి బాధితునికి అప్పగించారు. పర్సులో రూ.14,500 నగదు ఉన్నట్లు బాధితుడు తెలిపాడు. ఆర్టీసీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. డిపో అధికారులు నిజాయితీ చాటుకున్న సిబ్బందికి అభినందనలు తెలిపారు.

## మహిళా డిగ్రీ కళాశాల యందు ఆకస్మిక సందర్శన

- గిరిజన సంక్షేమ ప్రిన్సిపాల్ సెక్రటరీ డాక్టర్ ఏ శరత్



**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల యందు ఆకస్మిక సందర్శనలో భాగంగా విచ్చేసిన గిరిజన సంక్షేమ ప్రిన్సిపాల్ సెక్రటరీ డాక్టర్ ఏ శరత్ ఆకస్మిక సందర్శనలో భాగంగా విచ్చేసిన గిరిజన సంక్షేమ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ ఏ.శరత్ ని గిరిజన మహిళా డిగ్రీ ఎన్ సి సి విద్యార్థినిలు గౌరవ సూచకంతో స్వాగతం పలికారు, నల్గొండ రీజినల్ కోఆర్డినేటర్ ఈ. బలరాం, ప్రిన్సిపాల్ డాక్టర్. ఎం హరి ప్రియ, వైస్ ప్రిన్సిపల్ ఎన్. శ్వేత, మరియు అధ్యాపక బృందం, రాంసింగ్ పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించారు. సందర్శనలో భాగంగా డాక్టర్ ఏ శరత్ ,ASP మౌనిక విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి సంభాషించి, విద్యార్థినులతో మాట్లాడి వారికి కెరియర్ గైడెన్స్ ఇవ్వటంతో పాటు మెనూను పరిశీలించారు. తదనంతరం కళాశాలలోని లైబ్రరీ, ల్యాబ్, వెల్నెస్ సెంటర్, కిచెన్, స్టోర్ రూమ్ పరిశీలించారు. డాక్టర్ శరత్ రాకతో విద్యార్థినులు సంతోషం వ్యక్తం చేశారు.



# సైబర్ నేరగాళ్ల ఉచ్చులో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

జయభేరి, హైదరాబాద్, మార్చి 5



సైబర్ నేరగాళ్లు రెచ్చిపోయారు. ఏకంగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను టార్గెట్ చేశారు. ఆయన సోసల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ నుంచి ఫొటోలు సేకరించిన కేటుగాళ్లు.. వాటిని మార్ఫింగ్ చేసి న్యూడ్ కాల్స్ చేసినట్టు వీడియో తయారు చేశారు. ఆ వీడియోను వాట్సాప్ ద్వారా ఎమ్మెల్యే వీరేశంకు పంపి, డబ్బులు డిమాండ్ చేశారు. లేదంటే వీడియోను సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తామంటూ బ్లాక్‌మెయిల్ చేశారు. దాంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు.వివరాల్లోకి వెళ్తే.. నకిరేల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వేముల వీరేశంను సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. దీంతో ఆయన కాల్ లిఫ్ట్ చేయడంతో.. అవతలి వ్యక్తి నగ్నంగా కాల్ మాట్లాడారు. ఇంతలో కేటుగాళ్లు స్క్రీన్ రికార్డు చేసి మళ్లీ ఆయనకే పంపారు.. వీడియో విషయంపై బెదిరించి డబ్బులు డిమాండ్ చేశారు. ఆయన స్పందించక పోవడంతో ఆ వీడియోను సదరు కాంగ్రెస్ నేతలకు పంపారు .ఈ నేపథ్యంలో సదరు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు వీరేశంకు ఫోన్ చేయడంతో ఖంగుతిన్నారు. దీంతో నేరగాళ్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.ఇదిలా ఉంటే.. సైబర్ క్రైమ్.. ఈ పేరు వింటేనే వణుకుపుడుతోంది. పెరుగిపోతున్న సాంకేతికతను మోసగాళ్లు ఆసరాగా తీసుకుని అందిన కాడకి డబ్బులు దండుకుంటున్నారు. సులభంగా మనీ సంపాదించడంపై ఫోకస్ చేయడమే దీనికి ప్రధాన కారణం అని తెలుస్తుంది. గతంలో చోరీలు అంటే ఇంటి కిటికీలు, తలుపులు పగలగొట్టి బీరువాలో ఉన్న డబ్బును దొంగిలించే వారు. కానీ ఇప్పుడు కంప్యూటర్ల ముందు కూర్చొని కూడా కన్నాల వేయవచ్చని నిరూపిస్తున్నారు.సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పంథా ఎంచుకుంటున్నారు. కొంగొత్త మార్గాల్లో అమాయకులను మోసం చేస్తూనే ఉన్నారు. ఇప్పటికే ఎన్నో రకాల మోసాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. సైబర్ నేరగాళ్ల అమాయకులనే కాదు ప్రజా ప్రతినిధులను కూడా టార్గెట్ చేస్తున్నారు. తాజాగా ఓ ఎమ్మెల్యేపై అశ్లీల వీడియో కాల్స్‌తో సైబర్ నేరగాళ్లు ఎటాక్ చేశారు.

నల్లగొండ జిల్లా నక్రేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సెల్‌ఫోన్‌లోకి చొరబడి సైబర్ ఎటాక్ చేశారు. ఎమ్మెల్యే వేముల వీరేశం సోషల్ మీడియా అకౌంట్‌లో నుండి ఫోటోలను సేకరించిన సైబర్ క్రిమినల్స్.. స్క్రీన్ రికార్డు పర్సనల్ నెంబర్ వాట్సాప్ కి పంపి ఎమ్మెల్యేను బెదిరించారు. చివరికి తనపై జరుగుతున్న సైబర్ ఎటాక్‌పై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.నక్రేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తన అనుచరులతో మాట్లాడుతున్న సమయంలోనే సైబర్ నేరగాళ్ల నుంచి వీడియో కాల్ వచ్చింది. ఒక్కసారిగా నగ్నంగా ఉన్న వ్యక్తి వీడియో కాల్‌లోకి రావడంతో కాల్ కట్ చేశారు వీరేశం. వీడియో కాల్ సైబర్ మోసగాళ్లు చేస్తున్నారని వెంటనే పసిగట్టిన వీరేశం.. వెంటనే కాల్ కట్ చేశారు. అంతటితో వదలని కేటుగాళ్లు వాట్సాప్ చాటింగ్ ద్వారా మెసేజ్‌లు పంపి ఎమ్మెల్యేను బెదిరించారు సైబర్ నేరగాళ్లు. వీడియోలు ఫోటోలు సోషల్ మీడియాలో అప్లోడ్ చేయాలా లేదంటే డబ్బులు పంపిస్తావా అంటూ బ్లాక్ మెయిల్ చేశారు. అప్రమత్తమైన ఎమ్మెల్యే వీరేశం పోలీసులను ఆశ్రయించాడు. పోలీసుల సలహాతో సైబర్ నేరగాళ్ల నెంబర్ ను ఎమ్మెల్యే వీరేశం బ్లాక్ చేశారు.గత ఏడాది అక్టోబర్ లో సైబర్ నేరగాళ్లు ఎమ్మెల్యే వీరేశం పేరుతో డబ్బులు కావాలంటూ ఆయన సన్నిహితులకు వాట్సాప్ మెసేజ్‌లు చేశారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రజలను కోరారు. సైబర్ నేరాలు పట్ల అవగాహన కల్పించేందుకే రాష్ట్ర ప్రభుత్వం సెల్ ఫోన్ రింగ్ టోన్ ను పెట్టారని ఆయన చెప్పారు. సైబర్ నేరగాళ్ల వలలో ప్రజలు పడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫైబర్ నేరగాళ్ల విషయంలో ఆన్‌లైన్ గేమింగ్ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వేముల వీరేశం సూచించారు. అయితే కన్నం మీ ఇంటికి కాదు.. మీకు, మీ బ్యాంకు ఖాతాకు.గతంలో ఈ మోసాలా భారినపడిన వారిలో యువకులు, మహిళలు ఉంటే.. ఇప్పుడు రాజకీయ నాయకులు, వృద్ధులు కూడా ఈ కోవకే వచ్చేశారు. అసలు సైబర్ మోసం లేని రోజు లేదు అన్నట్లు కాలం మారిపోయింది. మరి ఇందుకు గల కారణాలు ఏంటి..? మోసపోకుండా ఉండాలంటే ప్రజలు ఏవిధంగా అవగాహన చెందాలి. కాస్త కంప్యూటర్ పరిజ్ఞానం ఉండటమే అర్హత. నాలుగు ముక్కలు మాట్లాడి బురిడీ కొట్టించగలిగితే అదే ఆయుధం. ఇదీ సైబర్ నేరస్థులు అనుసరిస్తున్న పంథా.. మొన్నటి వరకు వివధ దేశాలు నగరాలకే పరిమితమైన కేటుగాళ్లు ఇప్పుడు చిన్న చిన్న పట్టణాలు, పల్లెలు, తండాలకు కూడా విస్తరించారు. ఏమరుపాటుగా ఉన్నారో సర్వ నాశనమే. ఏదైనా గుర్తు తెలియని నెంబర్‌తో మెసేజ్ కానీ, ఫోన్ కానీ వస్తే లిఫ్ట్ చేయకండి.. చేశారో.. డేంజర్‌లో పడ్డట్టే.. మీ ముబైల్‌లో డేటా మొత్తం వాళ్ల చేతికి వెళ్లిపోతుంది. ఇక న్యూడ్ వీడియోలు, మెసేజ్‌లతో డబ్బులు కోసం బెదిరించే ఛాన్స్ ఉంది. ఇలాంటివి ఏమైనా వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి.

## రాజకీయ, వ్యక్తిగత దూషణలకు వేదికగా మారుతున్న వాట్సాప్ గ్రూపులు

జయభేరి, పరవాడ:



నేడు నడుస్తున్న కాలంలో ప్రపంచం మొత్తం సోషల్ మీడియా హవా ఏ స్థాయిలో విస్తరించి ఉందో అందరికి తెలిసిన విషయమే.తక్కువ సమయంలోనే ఎక్కువ ప్రచారం అందించడంలో సోషల్ మీడియా తన స్థానాన్ని అన్ని సందర్భాల్లో నిరూపించుకుంటూ వస్తుంది. అయితే ఇదే సోషల్ మీడియాని మంచికి వాడే వాళ్ళు ఉన్నారు చెడుకి వాడే వాళ్ళు ఉన్నారు.సోషల్ మీడియాలో వాట్సాప్ కు ఉన్న స్థానం అంతా ఇంతా కాదు.

ఇదే వాట్సాప్పు వేదికగా చేసుకొని మండలంలో గ్రామాలలోని యువత గ్రామోద్ధరకులుగా తమకు తాము ప్రకటించుకొని గ్రామం మొత్తము మీద కొన్ని గ్రూపులను తయారు చేసి వాటి ద్వారా తమ ఇష్టానుసారం పోస్టింగులు పెట్టి, స్వంత అజెండాలతో తమకు ఇష్టం వచ్చిన విధంగా ఏది బడితే అది పోస్టు పెడుతూ వాళ్ళకి నచ్చిన వాళ్ళను ప్రమోట్ చేసుకొంటూ మిగతా గ్రూపులో సభ్యులను రెచ్చగొడుతున్నారు.వాట్సాప్ ద్వారా చాటింగులు చేసే యువత తాము చేసే ప్రతి చాట్ గ్రూపులోని మిగతా యూజర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నదని గమనించకపోవడం గమనార్హం.

ఇలాంటి మెసేజ్స్ వలన గ్రామాలలో యువకులకు పట్టింపులకుపోయి వారు మధ్య విద్వేషాలు ప్రబలి వర్గాలుగా విడిపోయి బయట గొడవలు పడే స్థాయికి చేరుతుంది.

సమాచార సాధకాలుగా ఉన్న సోషల్ మీడియా ఇలాంటి వాట్సాప్ గ్రూపులుపై స్థానిక పోలీస్ శాఖ వారు నిఘా ఉంచి వాట్సాప్ గ్రూపులలో వచ్చే పోస్టింగులు, చాటింగులపై దృష్టి పెట్టి గ్రూపుల అడ్మినులకు తగు సూచనలు చేసి, వారిలో సరేనా పరిపక్వత వచ్చే విధంగా అవగాహన కల్పిస్తారని పరవాడ మండల ప్రజలు కోరుకొంటున్నారు.

## అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డాగా గుండాల తహసీల్దార్ కార్యాలయం

■ చనిపోయిన వ్యక్తుల భూములే టార్గెట్

జయభేరి, యాదాద్రి:



గుండాల తహసీల్దార్ కార్యాలయం అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డాగా మారింది. గుండాల మండలంలోని నూనెగూడెం గ్రామానికి చెందిన కప్పరి రామకిష్టయ్య 2017లో మరణించాడు. ఆయన పేరున గుండాల రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 450లో 0.08 గుంటలు, 451లో 0.15, 452 లలో 0.08 గుంటల భూమి ఉన్నది. రామకిష్టయ్యకు సత్యనారాయణ, కృష్ణారెడ్డి, ఇందిరమ్మ వారసులుగా ఉన్నారు. సదరు భూమిని వారసులకు తెలియకుండా.. నూనెగూడెం గ్రామానికి చెందిన "మలిపెద్ది రజిత" తానే వారసురాలినని.. 0.31గుంటల భూమిని 2022లో రెవెన్యూ అధికారులతో కలిసి ఫౌతి విరాసత్ చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న రామకిష్టయ్య వారసులు.. తహసీల్దార్ కార్యాలయంలో 2023 జనవరి 29న రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా వారు పట్టించుకోలేదు. ఫౌతి జరిగినట్లు తమకు నిజ ప్రతులు ఇవ్వాలని కోరినా ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. ఈ క్రమంలోనే కప్పరి రామకిష్టయ్య నుంచి మలిపెద్ది రజితకు ఫౌతి జరిగిన తర్వాత ఆమె నుంచి మలిపెద్ది సంజీవరెడ్డికి 0.08 గుంటలు, గండె నర్సయ్యకు 0.08 గుంటలు సేల్ డీడ్ ద్వారా విక్రయించారు. సంజీవరెడ్డి 0.08 గుంటల భూమిని తిరిగి తూనం రమేశ్ కు విక్రయించారని బాధితులు ఈసీలు చూపుతూ తమకు న్యాయం చేయాలని గుండాల తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్ నీలిమను వివరణ కోరగా.. తహసీల్దార్ జలకుమారి సెలవులో ఉన్నారని, ఫౌతి విషయం తనకు సోమవారం తెలిసిందని అన్నారు. ఉన్నతాధికారులను సంప్రదించి రెండు రోజుల్లో డాక్యుమెంట్ వివరాలు అందజేస్తామని, పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తామని చెప్పారు. కాగా, గుండాల రెవెన్యూ కార్యాలయం అక్రమాలకు అడ్డాగా మారిందని, మారుమూల మండలంపై జిల్లా అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. కొద్దిరోజుల కిందట ఇలాంటి ఘటనలోనే ఎన్ని ఎకరాల భూమి ఇతరులకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన విషయంలో తహసిల్దార్ జలకుమారి ని జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఆమె మరో అవినీతి వ్యవహారం తాజాగా బయటపడింది.



## విద్యుత్ స్తంబానికి ఢీకొని వ్యక్తి మృతి

■ నాచారం వద్ద అతివేగం తో స్తంబానికి ఢీకొన్న ఇనోవా కారు

జయభేరి, వర్గల్, మర్చి 05 :

అతివేగంతో విద్యుత్ స్తంభానికి ఢీకొని చనిపోయిన ఘటన వర్గల్ మండలం నాచారం వద్ద చోటు చేసుకుంది.గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వర్గల్ మండల కేంద్రానికి చెందిన పసుల లింగం (50) మంగళవారం తన సొంత పనిమీద తూప్రాన్ వెల్లాడు.అదే రాత్రి 10: 40 నిమిషాలకు తిరిగి ఇంటికి వస్తుండగా నాచారం గ్రామం వద్ద ఉన్న సిరి విత్తనాల కంపెనీ ముందు తన ఇన్నోవా వాహనాన్ని అతివేగం అజాగ్రత్తగా నడపడంతో వేగంగా వెళ్లి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. ఈ ఘటనలో లింగం తన చాతి భాగానికి బలమైన గాయాలు అయ్యాయి. వర్గల్ కు చెందిన బెస్థ నవీన్ లింగం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు అక్కడికి వెళ్లి 108 వాహనంలో గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా డాక్టర్ల సూచన మేరకు అక్కడి నుంచి ములుగు లోని ఆర్వియం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య యాదమ్మ ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ



జయభేరి, పరవాడ :

పరవాడ మండలం తాణం గ్రామం ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నా విద్యార్థులకు గ్రామ జనసేన పార్టీ నాయకుడు వర్రి పరదేశి నాయుడు పుట్టినరోజు సందర్భంగా సుమారు 35 మంది విద్యార్థులకు స్టేషనరీ పెన్నలు, అట్టలు , పుస్తకాలు పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా స్థానిక జనసైనికులు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి మరియు జన సైనికులు డి.రాజశేఖర్, రొంగలి శ్రీను, గొరిపూటి సురేషు, పైల కుమార్, షేక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు..

## ఎస్ ఎన్ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ లో జాతీయ భద్రత వారోత్సవాలు



జయభేరి, పరవాడ :

పరవాడ ఫార్మా సిటిలో ఉన్న ఎస్ ఎన్ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ లో 54వ జాతీయ భద్రత వారోత్సవాల సందర్భంగా జాతీయ భద్రతా దినమైనటువంటి మార్చి 4వ తేదీన వివిధ కార్యకలాపాలు నిర్వహించింది. మొదటి రోజు ఉద్యోగులు మరియు కాంట్రాక్టు ఉద్యోగులు సారాధ్యంలో భద్రత జెండాను ఎగరవేశారు. అనంతరం పలువూరు ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ ఎన్ ఆఫ్ ఇండియా చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కుమారేషన్ రాజేంద్రన్ హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రత యొక్క ప్రాముఖ్యత ప్రమాదాలు పై నివారణ చర్యలు తదితర అంశాలపై ప్రసంగించారు.భద్రత విభాగం ఉద్యోగులు మరియు కాంట్రాక్ట్ కార్మికులతో భద్రత పరికరాలు ప్రదర్శన మరియు భద్రత ప్రసంగం పోటీలు నిర్వహించారు.మార్చి నాలుగో తేదీ నుండి మార్చి 10వ తేదీ వరకు ప్రతి దినం ఒక్కొక్క కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎస్ ఎన్ ఎఫ్ యాజమాన్యం పేర్కొన్నారు.ప్రతి సంవత్సరం జాతీయ భద్రతావరోత్సవాల్లో ఎస్ ఎన్ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామి కావడం ఎంతో ఆనందించదగ్గ విషయమని యాజమాన్యం తెలిపారు.కార్మికులు భద్రతకు ఎస్ఎన్ఎఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కంపెనీ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## నెహ్రు యువ కేంద్రం వారి సౌజన్యంతో జిల్లాస్థాయి స్పోర్ట్స్ మీట్



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ ఫోర్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 8, 9 తేదీలలో శనివారం, ఆదివారం రెండు రోజులు జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీటింగ్ నిర్వహించడం జరుగుతుంది. ఇందులో అండర్ 20, కబడ్డీ అమ్మాయిలకు మాత్రమే, షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్, వాలీబాల్, రన్నింగ్ అమ్మాయిలకు మాత్రమే. ఈ యొక్క జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ లో పాల్గొనాలనీ అనుకునేవారు వివరాలకు దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనమునందు సంప్రదించగలరు దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్. 9440433985, 9848759285.




## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన అంజిరెడ్డి

■ శుభాకాంక్షలు తెలియజేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి

జయభేరి, షాద్ నగర్, మార్చి 05 :

కరీంనగర్ మెదక్ నిజామాబాద్ అదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి ఘన విజయం సాధించిన అంజిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన తెలిపిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్ రెడ్డి. ఈ సందర్భంగా అంజిరెడ్డి వర్ధన్ రెడ్డి వారికి ఉన్నటువంటి అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ జిహెచ్ఎంసి ఎన్నికలకు ముందు అంజి రెడ్డి, గోదావరి అంజిరెడ్డి బిజెపి పార్టీలోకి తీసుకువచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతంలో టీచర్ ఎమ్మెల్సీగా పోటీ చేసిన శ్రీవర్ధన్ అనుభవాన్ని ఈ ఎన్నికల సందర్భంగా ఇచ్చినటువంటి సలహాలు సూచనలు ఈరోజు ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయానికి చాలా దోహదపడ్డాయని ఈ ఎన్నికల్లో అందించిన సహాయ సహకారాలను ఎప్పటికీ కూడా మర్చిపోలేనని అంజి రెడ్డి సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగబాబు పేరు ఖరారు చేసిన పవన్ కళ్యాణ్



జయభేరి, విజయవాడ, మార్చి 5:

శాసన సభ్యుల కోటాలో నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల వ్యవహారంలో ఊహించని ట్విస్ట్ చోటుచేసుకుంది. నిన్నటి వరకూ ఎమ్మెల్సీ అభ్యర్థి నాగబాబు పేరు ప్రచారం కాగా, బుధవారం ఉదయం ఆయన రాజ్యసభ స్థానం కోసం చూస్తున్నారని ప్రచారం జరిగింది. ఈ ప్రచారం ఊపందుకున్న సమయంలో జనసేన పార్టీ వదంతులకు చెక్ పెట్టింది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమిలో భాగంగా జనసేన అభ్యర్థిగా కొణిదెల నాగబాబు పేరును పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఖరారు చేశారు. నాగబాబు ప్రస్తుతం జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయాలని నాగబాబుకి పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నుంచి సమాచారం వచ్చింది. దాంతో నాగబాబు నామినేషన్ కు అవసరమైన పత్రాలు సిద్ధం చేయాలని పార్టీ కార్యాలయాన్ని పవన్ కళ్యాణ్ ఆదేశించారని పి.హరిప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు.

05


జయభేరి
సినిమా
06-03-2025
గురువారం
jayabheridaily.com



## సమస్య చుట్టూ తిరిగే సైకో థ్రిల్లర్

సంతోష్ కల్వచెర్ల, క్రిషేక పటేల్ జంటగా రూపొందుతున్న చిత్రం 'ఆర్టిస్ట్'. రతన్ రిషి దర్శకుడు. జేమ్స్ వాట్ కొమ్ము నిర్మాత. ఈ నెల 21న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమం హైదరాబాద్‌లో నిర్వహించారు. దర్శకుడు రతన్ రిషి మాట్లాడుతూ 'ఇదొక సైకో థ్రిలర్. సస్పెన్స్, భయం కామెడీ, రొమాన్స్ ఇందులో మెండుగా ఉంటాయి. ఓ ఉద్వేగపూరితమైన కథ ఇది. ముఖ్యంగా చివరి 20 నిమిషాలు ఉత్కంఠను రేకెత్తిస్తుంది. ఆడియన్‌కి అద్భుతమైన ఫీల్‌ని కలిగిస్తుంది. సాంకేతికంగా కూడా ఆకట్టుకుంటుంది.' అని తెలిపారు. సమాజంలోని ఓ సమస్య చుట్టూ ఈ కథ తిరుగుతుందని, కథ, కథనాలు కొత్తగా ఉంటాయని, పేషన్ ఉన్న నిర్మాత దొరకడం తమ అదృష్టమని హీరో సంతోష్ అన్నారు. మంచి కంటెంట్‌తో ఈ సినిమా నిర్మించామని నిర్మాత జేమ్స్ వాట్ కొమ్ము చెప్పారు. ఇంకా కథానాయిక క్రిషేక పటేల్. మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి తదితరులు మాట్లాడారు.

## ఏటిగట్టుపై ఆటా పాటా



బ్లాక్‌బస్టర్ 'విరూపాక్ష' తర్వాత హీరో సాయిదుర్గతేజ్ శక్తిమంతమైన పాత్రలో నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'సంబరాల ఏటిగట్టు'. రోహిత్ కె.పి దర్శకుడు. కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మాతలు. ఇప్పటికే విడుదలైన కార్నేజ్ టీజర్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చిందని, లార్జర్ దెన్ లైఫ్ మేనర్‌లో సాయిదుర్గతేజ్ పాత్రను దర్శకుడు రోహిత్ ప్రజెంట్ చేశారని, అంతకు మించి సినిమా ఉంటుందని నిర్మాతలు చెబుతున్నారు. ఇటీవలే రామ్‌లక్ష్మణ్ నేతృత్వంలో భారీ యాక్షన్ సీక్వెన్స్‌ని చిత్రీకరించారు. ప్రస్తుతం దినేష్ మాస్టర్ డాన్స్ డైరెక్షన్‌లో ఓ పాటను షూట్ చేస్తున్నారు. ఈ పాటలో వెయ్యిమంది డాన్సర్లు కనిపించబోతున్నారు. ఈ పాట సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. 125కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఐశ్వర్యలక్ష్మీ కథానాయిక. జగపతిబాబు, సాయికుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: వెట్రివేల్ పళనిస్వామి, సంగీతం: బి.అజనీష్ లోక్‌నాథ్, నిర్మాణం: ప్రైమ్‌షో ఎంటర్టైన్మెంట్స్.



## మన గురించి ప్రజలెందుకు ఆలోచించాలి ?

కళాకారులు తమ కళారూపాల ద్వారా మాత్రమే ప్రేక్షకులకు చేరువ కావాలి తప్ప.. వ్యక్తిగతంగా కాకూడదు. సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలు ఎంత గోప్యంగా ఉంటే అంత మంచిది. అందుకే.. సోషల్ మీడియా అకౌంట్ ఉన్నా.. దాన్ని తక్కువగా వాడతాను.' అంటున్నది అందాలభామ యామీ గౌతమ్. ఇంకా ఆమె చెబుతూ 'ఈ మధ్య చాలామంది సెలబ్రిటీలు వారి జీవితాల్లో జరిగే ప్రతి విషయాన్నీ సోషల్ మీడియాతో పంచుకుంటున్నారు. తినే తిండి దగ్గరనుంచి ఖాళీ సమయాల్లో తమ జీవన విధానం వరకూ ప్రతి విషయాన్నీ సోషల్ మీడియాలో ప్రస్తావిస్తున్నారు. అది మంచి పద్ధతి కాదు. మన జీవితంలో జరిగే ప్రతీది సమాజానికి అక్కర్లేదు. అసలు మన గురించి ప్రజలు ఎందుకు ఆలోచించాలి?. వాళ్లకు మన గురించి ఎంత తక్కువ తెలిస్తే.. మన పాత్రలు వాళ్లకు అంత ఎక్కువ కనెక్ట్ అవుతాయ్. తెరపై కనిపించగానే మన వ్యక్తిగత జీవితం వాళ్లకు గుర్తురాకూడదు.' అని అభిప్రాయపడ్డారు యామీ గౌతమ్. తన కుమారుడి గురించి మాట్లాడుతూ 'నా కొడుకుని కూడా మీడియాకు దూరంగా పెంచాలనుకుంటున్నా. వాడు సెలబ్రిటీ కొడుగ్గా కాకుండా సామాన్యుడిగా పెరగాలని ఆశిస్తున్నా' అని తెలిపారు యామి.



## అధికారుల సోదాలు..

కన్నడ నటి రాన్యా రావును బెంగళూరు విమానాశ్రయంలో రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఆమె నుంచి 14.8 కిలోల బంగారాన్ని అధికారులు సీజ్ చేశారు. పట్టుబడిన బంగారం విలువ దాదాపు రూ. 12.56 కోట్లు ఉంటుందని అంచనా. అయితే, నగరంలోని లావెల్లే రోడ్డులోని ఆమె నివాసంలోనూ అధికారులు తాజాగా సోదాలు చేపట్టారు. ఈ సోదాల్లో మరో రూ. 2.06 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, రూ. 2.67 కోట్ల నగదు గుర్తించారు. ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఇప్పటి వరకూ ఆమె వద్ద నుంచి రూ. 17.29 కోట్ల విలువైన బంగారం, నగదు సీజ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఇటీవలే కాలంలో బెంగళూరు విమానాశ్రయంలో జరిగిన అతి పెద్ద బంగారం అక్రమ రవాణా కేసుల్లో ఇది ఒకటి అని డీఆర్‌ఐ అధికారులు తెలిపారు. కాగా, 35 ఏళ్ల రన్యారావు కిచ్చా సుదీప్ హీరోగా నటించిన 'మాణిక్య' చిత్రంతో తెరంగేట్రం చేశారు. ఆ తర్వాత 'వాఘా', 'పటాకీ' సినిమాల్లో నటించారు. అయితే, రాన్యా ఇటీవతే తరచూ దుబాయ్ వెళ్లి వస్తుండడంతో ఆమెపై అధికారులు నిఘా పెట్టారు. గత 15 రోజుల్లో ఆమె నాలుగుసార్లు దుబాయ్ వెళ్లడాన్ని గమనించారు.



## 'మార్కో' సినిమాని బ్యాన్ చేయండి.. కేంద్రానికి లేఖ రాసిన సెన్సార్ బోర్డు..!

మార్కో సినిమాను బ్యాన్ చేయాలంటూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ కేంద్రానికి లేఖ రాసినట్లు తెలుస్తుంది. మలయాళీ నటుడు ఉన్ని ముకుందన్ ప్రధాన పాత్రలో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ మార్కో. హనీఫ్ అదేని ఈ సినిమాకు దర్శకత్వం వహించగా.. యాక్షన్ జానర్‌లో ఈ సినిమా వచ్చింది. డిసెంబర్ 20న మలయాళంలో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకోవడమే కాకుండా.. బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ.100 కోట్ల వసూళ్లను రాబట్టింది. సినిమాలో మితిమీరిన వయోలెన్స్ ఉన్న కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంది ఈ చిత్రం. అయితే ఈ సినిమాను బ్యాన్ చేయాలంటూ సెన్సార్ బోర్డు కేంద్రానికి లేఖ రాసింది.

ఈ సినిమా ఓటీటీలో సోనీ లివ్ తో పాటు అమెజాన్ ప్రైమ్, ఆహా లో ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతుంది. అయితే ఈ సినిమాను ఓటీటీ లో నుంచి బ్యాన్ చేయాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ కోరింది. ఈ చిత్రాన్ని మరి దారుణంగా తెరకెక్కించడంతో పాటు చిన్న పిల్లలను క్రూరంగా చంపడం, గర్భిణి యువతిని.. కళ్లు లేని యువకుడిని చంపే సన్నివేశాలు దారుణంగా ఉన్నయంటూ సెన్సార్ బోర్డ్ తెలిపింది. అందుకే ఈ సినిమాను ఓటీటీలో నుంచి తొలగించాలని కోరుతూ లేఖ రాసినట్లు సమాచారం. మరోవైపు ఇప్పటికే ఈ సినిమాను టీవీలో ప్రసారం చేయకుండా బ్యాన్ విధించినట్లు తెలుస్తుంది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com